మనకీ జీవితం చాలు

పొండపాటి దేవదాసు

రాయుడుగారు బస్టాండ్ కేసి బయల్దేరారు.

రాయుడుగారు రోడ్డువెంట నడుస్తున్న తీరు సామాన్యంగా లేదు.

గర్వంగా తల పైకెత్తి ఠీవిగా హుందాగా అడుగులు వేస్తున్నారు.

ఆయన ఠీవికి హుందాతనానికి ఏ మాత్రం తీసిపోనట్లుందాయన వేషం కూడా।

మల్లెపూవులా మెరిసిపోతున్న గ్లాస్కో పంచ—గోధుమవన్నె సిల్కు లాల్చీ—భుజంమీద జరీకండువా—నీట్‌గా వెనక్కి దువ్వబడిన సగంపైగా నెరిసిపోయిన జుట్టూ—చక్కగా పాలిష్ చేయబడి నిగ నిగ లాడుతున్న ఆఫ్‌బూట్ కంకర రోడ్డుమీద టక్‌టక్‌మని శబ్దం చేస్తున్నాయి.

నిజానికి రాయుడుగారి వయసు ఇంచు

మించు అరవై ఏళ్ళయినా — ఆ ముస్తాబులో — ఆ నడుస్తున్న తీరునిబట్టి చప్పున ఓ పదేళ్లు తగ్గిపోయినట్లుగా అగుపిస్తున్నా రాయన.

"ఏం సుబ్బయ్యా! ఏమిటి విశేషాలు? ఎలా వున్నయి పైర్లు?' నడుస్తున్న వారినల్లా ఆగి అడిగారు రాయుడుగారు.

ఆ వీధి అరుగుమీద కూర్చున్న సుబ్బయ్య కాలుస్తున్న చుట్ట నోట్లోంచి తీసి "ఆc....ఏం పైర్లు! వర్షాల్లేక మల మల మాడిపోతున్నాయంటే నమ్మ! ఈ అదున్లో గనుక మాంచి వాన ఒక్కటంటే ఒక్కటి గట్టిగా కురిస్తేనా నా సామిరంగ అప్పుడడుగుతావూ పైర్ల సంగతి?'

"అదున్లో కురవాలని వర్షానికిమాత్రం తెలీదుటయ్యా! దానికి బుద్ధీ జ్ఞానం లేదనుకున్నావా? వుంది, ఎవడికోసం కురుస్తుంది! కురిసి తీరుతుంది. మరేం దిగులు పడబోకు సుబ్బయ్యా:"

బయల్దేరారు రాయుడుగారు.

"ఏమోయ్ నరసింహులు!"

రాయుడుగారి పిలుపు విని ఎవర్తోనో మాటాడుతున్న నరసింహులు హఠాత్తుగా ఆ సంభాషణని ఆపి గబగబ రాయుడుగారి దగ్గిరగా వచ్చాడు.

"ఏమిటోయ్ విశేషాలు? ఆc. ..మర్చిపోయాను, ఎలా వుంది మీ అబ్బాయిల పరిస్థితి? ఏమైనా పొదుపుల్లో పడ్డారంటావా? ఇంటికేమాత్రం పంపుతున్నారు?" తిరిగి ప్రశ్నించారు రాయుడుగారు.

"ఏం చెప్పమంటావోయ్ రాయుడూ! నాకు కొద్దో గొప్పో ఆస్తిపాస్తులున్నయి. కానీ సుఖం శాంతీ అనేవి రెండూ లేవు. నీకు ఆస్తిపాస్తుల్లేకపోయినా నాకు లేనివి రెండూ నీలో పుష్కలంగా వున్నయి. నువ్వు అదృష్టవంతుడివి ఏమైనా నేనీ జన్మలో రాయుణ్ణి కాలేను! అలాగే నా కొడుకులూ రాయుడు కొడుకుల్లాంటివాళ్లు కాలేరు, ఇది నిజం. ఇంక వివరాలు నన్నడక్కు. '

"ఓరి నీ అసాధ్యం గూల: అలా ఇదై పోతావేమిటోయ్? కాస్త మెసులు బాటు చూసుకుని వాళ్ళే పంపుతార్లే మరేం బెంగపడకు:'

ఈసారి ఉప్పొంగిపోతూ నడుస్తున్నారు రాయుడుగారు.

"హల్లో! రామనాథంగారూ!"

మలుపు తిరగబోయిన రామనాథం రాయుడుగారి పిలుపు విని ఆగాడు.

"ఊళ్ళో కొచ్చిగూడా కనపడటంలేదు! కులాసా! ఇప్పుడెక్కడా ఉద్యోగం? గుంటూర్లోనేనా? అదే స్కూలా?"

"అవునండీ!' రాయుడుగారి ప్రశ్నలకి సమాధానంగా అన్నాడాయన.

'వెరీ గుడ్! వెరీ గుడ్! ఆc... మనం కలిసి అయిదేళ్ళు పైగా గడిచిపోయింది కదూ! అది సరే ఈ సంగతి విన్నావా? మా అబ్బాయిలిద్దరూ ఆఫీసర్లయ్యారు. దర్జాగా వున్నార్లే! గర్వంగా

యువ

తలెగరేసి లాల్చీ జేబులోంచి విల్సు సిగరెట్ పెట్టె బయటికి తీసి, తానొకటి అంటించి మరొకటి రామనాథానిక్కూడా ఆఫర్ చేశారాయన.

ఇద్దరూ సిగరెట్లు కాలుస్తున్నారు.

"ఏమిటండీ అలా చూస్తున్నారు? నేను రిటైరై పోయాను. ప్రస్తుతం ఖాళీ! మరి వస్తా, బస్సొచ్చే వేళైంది" అంటూ గబగబ అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయారు రాయుడుగారు.

తన విషయాలేవో చెప్పుకుందా మనుకున్న రామనాథం ఒక్కసారి గతుక్కుమని గుడ్‌బై చెబుతున్నట్లు మవునంగా చెయ్యి గాల్లో వూపి తనదారిన వెళ్ళిపోయాడు.

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో సుబ్బారాయుడు — ఈ భూమ్మీద సమస్య లన్నింటినీ తానొక్కడే భరిస్తున్నట్లు ఒంగిపోయి నడిచేవాడు. ఆ మనిషిలో— నడకలో—ఠీవి, హుందాతనం మచ్చుకైనా కనిపించేవి కావు: ఒక్కమాటలో అప్పటి సుబ్బారాయుడు వేరు. అందు క్కారణాలు లేకపోలేదు. అప్పట్లో ఆయనొక మహా యజ్ఞాన్ని ప్రారంభించాడు మరి.

ఆయనకి ఇద్దరే కొడుకులు. అలా వాళ్ళు ఆయనకి సంక్రమించిన సిరి సంపదలు. తనలోనుంచి వచ్చిన వాళ్ళిద్దరి భావిజీవితాల్ని తాను అందంగా తీర్చిదిద్ది సమర్థుడైన తండ్రిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చుకోవాలనుకున్నాడు. ఆ బరువు బాధ్యతలు మేరు పర్వతానికి మించినవని ఆయనకి తెలుసు. అయినా ఆయన జంక లేదు. వెనకడుగు వేయలేదు.

తన కొడుకుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆ బరువుని పదిలంగా పట్టుకుని ప్రేమతో—ఆత్మ స్థయిర్యంతో నెత్తిన పెట్టుకున్నాడు.

తనలోని సరదాలు—షికార్లు—సుఖాల తాలూకు తలపుల్ని ఐచ్ఛికంగా సునాయాసంగా గట్టిగా మూసేశాడు.

అంచాతనే ఆయనా రోజుల్లో ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. అసలా తీరుబడే లేదాయనకి. సీట్లో కూర్చుని ఎప్పుడూ లెక్కలువేస్తూ హడావుడిగా వుండేవాడు.

తలెత్తితే ఏ దృశ్యాలు కనిపించి తను ప్రారంభించిన యజ్ఞాన్ని భంగపరుస్తాయా? కనిపించిన ప్రతివాడితో బాతాకానీ వేస్తే తన లక్ష్యాలెక్కడ మారిపోతాయో అని అనుక్షణం జాగ్రత్త పడేవాడు.

ఆయనారోజుల్లో హోటళ్ళకి వెళ్ళడం చాలా అరుదు. వెడితే చిన్నహోటల్లోకెళ్ళి టీ నీళ్ళతో తృప్తిపడి వచ్చేవాడు.

నీ బట్టలేమిటి? నీ తిండీతిప్పలేమిటి? అలా గజిబిజిగా వుండటమేమిటని ఆయన సన్నిహిత స్నేహితుల్లాంటి వాళ్ళు ఎవరడిగినా సరే ఆయన చెప్పే స్లోగన్- వినాదం సఖుగుడు గొణుగుడు అన్నీ ఒక్కటే: "నా పిల్లలు పైచదువుల్లో

వున్నారు. వాళ్ళని ఒడ్డెక్కించాలి. అందుకు నేనింకా ఎంతో జాగ్రత్తపడాలి'' అని.

ఆ రోజుల్లో ఒకసారి ఆఫీసు గుమాస్తాలంతా కార్తీకమాసం సందర్భంలో పిక్నిక్ ప్రోగ్రాం వేశారని, పది రూపాయలు చందా యివ్వాలని సుబ్బారాయుణ్ణడిగారు.

పది రూపాయల చందా కేవలం అక్కడ కెళ్ళి ఏదో చత్త తినటానికి ఒక్కొక్కడికి పది రూపాయల చందానా? చూస్తే ఒక్కొక్కడికి అరడజనుమంది పిల్లలు. సంసారాలు గడవక తను విలాసాలకి అప్పుచేసి పప్పుకూడులా గడిపే వెధవలకి పిక్నిక్కులు—పార్టీలు—వన భోజనాలు కావలసివచ్చాయా?

పిల్లలున్నారు వాళ్ళ చదువులేమిటి? భవిష్యత్తేమిటి? ఈ బరువు బాధ్యతల్ని ఒక్కడూ ఆలోచిస్తున్నట్లు కనపడరేం? ఇంట్లో ఈగలమోత బయట పల్లకీల మోతన్నట్లు వీళ్ళ బ్రతుక్కి నెలకి రెండు పిక్నిక్ ప్రోగ్రాంలూ—నాలుగు పార్టీలు పీళ్ళూను. వీళ్ళు వుద్యోగులా? పిల్లలకి తండ్రులుకాదు. ఫూల్సు బ్రూట్సు—ఏ క్లాస్ రోగ్సు.

''మీరంతా బరువు బాధ్యతల్లేనివాళ్లు. భాగ్యవంతులు. మీ రెన్నిసార్లన్నా పిక్నిక్కులకి పోతారు. కానీ నేను మీతో తూగలేనివాణ్ణి. నాకు చాలా బాధ్యతలున్నాయి. ఈ పది రూపాయలు బెనారస్‌లో చదువుతున్న నా బిడ్డలకే పంపితే ఎందుకైనా వుపయోగించుకుంటారు. నేను రాలేను. రాను. మరెప్పుడూ నన్నిలా అడగవద్దు'' అని వెంటనే తన పనిలో మునిగిపోయేవాడు.

పిసినారి—మొండివాడు—పాషాణుడు—ఇలాంటి మాటల్ని సుబ్బారాయుడువినేలా హేళనగా అనేవాళ్ళు గుమాస్తాలు.

ఆ మాటలు తనకి ములుకుల్లా గుచ్చుకున్నట్లనుకునేవాడు కాడు. మధురంగా స్మరించి తన పట్టుదలని ఇనుమడింపజేస్తున్నట్లుగా భావించే వాడాయన.

అలా తన పట్టుదలని—కార్యదీక్షని ఆత్మస్థయిర్యాన్ని కొన్ని సంవత్సరాలు జాగ్రత్తగా పోషించుకుంటూవచ్చి చివరికి తనయజ్ఞాన్ని జయప్రదంగా ముగించాడు.

తనమీదున్న బరువుని దించుకుని తృప్తిగా నిట్టూర్చాడు. అలసి సొలసిన ఆయన ప్రాణానికి ఎంతో విశ్రాంతి లభించినట్లయ్యింది.

కొడుకులిద్దరూ ఆఫీసర్లు కావడంతో సంపూర్ణస్వేచ్ఛా — సంతృప్తి నింపిన మనిషై సుబ్బారాయుడల్లా రాయుడుగార్లా మారి ఏపుగా పెరిగిపోయాడు.

కొడుకు లిద్దరూ చెరోలక్షా అనుకున్నాడాయన. వాళ్ళిద్దరూ ఆయనవెనుక మేరు పర్వతాల్లా నిల్చి అపూర్వ చైతన్యంతో—ఆనందోత్సాహాల్లో ప్రశాంతవాతావరణంలో నడిపిస్తున్నట్లుగా అనుభూతి చెందుతున్నాడాయన.

ఆయన కేవలం కొడుకుల్ని—వాళ్ళ



హోదాలు చూసుకుని దర్జాగా బతుకుతున్నారు. కైలాసపర్వతాన్ని తాను బహు తేలిగ్గా ఎత్తగలిగాననని పలుమార్లనుకుని తనలో తాను యెంతో గర్వపడుతుంటారు

రాయుడుగారు బస్‌స్టాప్‌లో నిల్చుని మరో సిగరెట్ వెలిగించారు.

ఆ వూరికి రెండుమైళ్ళ దూరంలో బస్తీ వుంది.

ఇంతలో దూరంగా బస్సు వస్తున్న శబ్దం విన్పించింది, ప్రయాణీకులంతా బిలబిలమంటూ లేచారు.

బస్సు వేగంగా వస్తోంది. ఆగే సూచనలు కనిపించలేదు. రాయుడుగారు జరీ కండువాని హుందాగా విదిలించి భుజం మీద వేసుకుని తన విగ్రహం వీలైనంత స్పష్టంగా—ఆ డ్రైవర్ గుర్తించేలా ఆంజనేయులు వారు అసలురూపం ప్రదర్శిస్తున్న భంగిమలో నిల్చున్నారాయన.

బస్సు ఆగదన్నట్లు హారన్ వినిపిస్తూ వెళ్ళిపోయింది,

రాయుడుగార్కి కోపమొచ్చింది.

ఈ బస్సులవాళ్ళకి కళ్ళు పొరలు గమ్మాయి. ఎక్కడ ఏ మనిషి నిల్చున్నాడన్న దృష్టి బొత్తిగా లేకుండాపోయింది. చూస్తాను వీళ్ల వ్యవహారమేమిటో! వెడుతున్న బస్సువేపు కసిగా చూశారు రాయుడుగారు.

మరో పదినిమిషాలు గడిచాయి.

ఈసారి బస్సువచ్చి ఆగింది. రాయుడుగారు దాని చేరువగా వెళ్లి లోపలకి చూశారు. నిలబడిన జనం ఒకరిమీద ఒకర్ని వేసి తాడుతో కట్టేసినట్లు కిటకిటలాడిపోతున్నారు.

ఇది బస్సా! చిన్నసైజు నరకంలా వుంది. నే నిందులో ఎక్కడమా! ; ఎక్కలేనంతే! అనుకున్నాడు.

బస్ బయల్దేరి పోయింది.

రాయుడుగార్లో అసహనం పెరిగిపో తోంది. గడియారం చూసుకున్నారు, పావుతక్కువ ఎనిమిదైంది, విసుగ్గా చేతిలోని సిగరెట్‌ని నేలకేసికొట్టారు.

ఎనిమిదిన్నర దాటితే ఆ హోటల్లో ఆ కమ్మని ఇడ్లీలుండవ్! ఆ చట్నీ—ఆ నెయ్యీ అన్నీ కల్తీ అయిపోయి రుచి లేకుండా పోతాయి, మరోసారి పురజను లందరి కోర్కె తరపున కురుక్షేత్రం నాటకాన్ని మళ్ళీ ఆడమని ఆ సమాజం వారి నడగాలి.

వెధవ బస్సులు—డొక్కు బస్సులు, ఇవి లేకపోతే ప్రయాణాలు చెయ్యలేమా?

"ఏయ్ జట్కా!" పొలికేక పెట్టారు రాయుడుగారు.

ఓ జట్కా వచ్చి ఆయన ముంద ఆగింది.

రాయుడుగారు జట్కాలో కూర్చుని "పోనీవోయ్ త్వరగా!" అన్నారు.

"తమరొక్కరేనా? ఇంకా ముగ్గురన్నా వస్తే.... ...!" జట్కావాలా మాటలు పూర్తికాకముందే మధ్యలో అందుకుని "నాకు తెలుసులే పోనీవోయ్! ఊం.... త్వరగా—ఆ బస్సుతో సమానంగా వెళ్లాలి."

రాయుడుగారి మాటలకి హడలిపోయిన జట్కావాలా చక్‌మని జట్కాలో ఎక్కి "చల్" అన్నాడు.

గుఱ్ఱం పరుగు లంకించుకుంది.

రాయుడుగారు మామూలుగా కాఫీ టిఫిన్లు తీసుకునే హోటల్‌కి ఇవతలగా జట్కా దిగి పర్సులోంచి డబ్బుతీసి జట్కావాలాకిచ్చి "ఇది చాలా?" అన్నారు.

జట్కావాలా చేతిలో డబ్బుచూసు కుని కృతజ్ఞతగా చేతులు జోడించాడు రాయుడుగార్కి.

అలా నాలుగడుగులు ముందుకువెళ్లిన రాయుడుగారు హఠాత్తుగా వెనక్కి తిరి గొచ్చి ఎందుకో ఓ మాటు జట్కాలోకి తొంగి చూశాడు

"ఏం బాబూ! కళ్ళజోడేమైనా మర్చి పోయారా?" అన్నాడు జట్కావాలా ఆదుర్దాగా.

అతని వేపు చురుగ్గా చూశారురాయుడు గారు.

"కళ్ళజోడు ఒకప్పుడుండేదోయ్; దాన్ని తీసేసి అయిదేళ్ళయ్యింది .. అయిదేళ్ళు!!.... ముసలాణ్నిగదా చూపు బాగా కనబడదనుకున్నావేమో? ఈ మధ్య మరింత పెరిగిందోయ్. ఇప్పుడు నా కళ్ళు మహా దర్జాగా కన్పిస్తున్నాయిలే! సరే. . సరే ... మళ్ళీ బాడుగేదన్నా చూసుకో!" అంటూ ముందుకు నడిచారు రాయుడు గారు.

ఎప్పుడూ వెధవది ఈ హాల్లోనే కాఫీ తాగటమేమిటని సరాసరి వెళ్ళి ఆదే హోటల్లో ఎయిర్‌కండిషన్డు రూంలోకెళ్లి కూర్చున్నారాయన.

సర్వరొచ్చాడు.

సర్వర్ రాయుడుగార్ని ఓసారి పరిశీలనగా చూసి రెండు నిమిషాల్లో ఇడ్లీ తెచ్చిపెట్టాడు.

ఇడ్లీలు తింటున్న రాయుడుగారు సర్వర్ని ఓ చోట నిలకడగా నిలబడ నివ్వలేదు

ముసలాయన గొప్ప సరదా మనిషను కున్నాడు సర్వర్.

"ఇదిగో అబ్బాయి ఇలా రా!"

సర్వర్ గబగబ వచ్చాడు.

"ఓ కాఫీ పట్రా! కాఫీ అంటే ఎలా వుండాలి? బ్యూటిఫుల్ కాఫీ—స్పెషల్ కాఫీ పట్రా! బిల్లు అయిదు రూపాయలైనా వేసుకో! నా కభ్యంతరం లేదు, కాఫీ మాత్రం చాలా బావుండాలి. నాకు జబ్బేం లేదు. పంచదార ఎక్కువే వెయ్. కమాన్ త్వరగా వెళ్లివచ్చేయ్".

ముసలాయన మంచి జోరుమీదున్నాడే? అనుకుని సర్వర్ వెళ్ళి కాస్త ఆలస్యమైనా మంచి కాఫీనే తెచ్చిపెట్టాడు.

కాఫీ ముగించి కౌంటర్లో బిల్లు చెల్లించి వక్కపలుకులతోపాటు మళ్ళీ ఓ సిగరెట్ అంటించి అలా రోడ్డు వెంట నడుస్తూ బయల్దేరారు రాయుడుగారు.

అలానడుస్తూ మలుపు తిరగబోయిన రాయుడుగార్కి ఎదురుగ్గా భోజనహోటల్ ముందర 'యాత్రాస్పెషల్!' అని పెద్ద అక్షరాల్తో వ్రాయబడివున్న బోర్డు కనిపిం వుంది.

గబగబ నడుచుకుంటూ దాని ద వెళ్ళా రాయన, కాశీ రామేశ్వరం బదరీనాథ్ మొదలుదేశంలో దాదాపు క్షేత్రాలన్నింటికి స్పెషల్ రైలు బం తోందని—భోజన సదుపాయలు—ఛ వగైరాలన్నీ వివరంగా రా వున్నాయి,

రాయుడుగారి ఆలోచనలు ఒక యాత్రల మీదికి మళ్ళాయి.

ఇంత గొప్ప యాత్రలు చే వాళ్ళు ఎలాంటివాళ్ళయి వుం డబ్బున్నవాళ్ళయ్యుండాలి. ఇలా యాత్రలు ఎప్పుడు చెయ్యాలి? జీవి అనుకున్నవన్నీ భగవంతుడు జరి తీరుబడి చిక్కినప్పుడు ఈ యా తలపెట్టాలి! ఇలాంటి యాత్రలు కోసం చేస్తారు? మనశ్శాంతికోసం వంతుని జ్ఞాపకాల్తో తరించే నిమి

"ఇదుగో! దీనికి సంబంధించి ఎవరిక్కడ? "తలెత్తి ఎదురుగ్గా ని ఓ పదహారేళ్ళ కుర్రాణ్ని చూసి రాయన.

"లోపలున్నారు సార్! మంటారా?"

"ముందా కుర్చీ తెచ్చి ఇక్క తరువాత వెళ్ళి పిలువ్?"

ఆ కుర్రాడు అలాగే కుర్చీ

వేశాడు. రా యు డు గా రు కూర్చున్నా రందులో.

"నమస్కారం రాయుడుగారూ!"

"ఓ మీరా రంగారావుగారూ! ఏజం టంటే ఇంకెవరో అనుకున్నాను. వెరి గుడ్ చాలా మంచి ఏర్పాటు చేశారు.

"మీలాంటివారికోసమే ఇలా ఏర్పాటు చేశాం సార్:"

"భేష్? చాలాబాగుంది. మన పేర ఓ టిక్కెట్ రాసుకోండి"

"తప్పకుండా సార్!' అంటూ అతను టిక్కెట్లపుస్తకం తెచ్చి రాయబోతున్న వాడల్లా ఆగి—"అంతపైకం ఇప్పుడు తెచ్చివుంటారా? ముందుగా మీరనుకొని వుండరుగదా!" అన్నాడు.

ఎంత అందంగా అడిగాడు డబ్బు విష యము? శభాష్! చాలా గొప్పగా అడి గాడు, వ్యాపార దక్షతంటే అలా వుండాలి.

"అయాం సారీ! నిజమే ముందుగా అనుకోలేదు. మీరు చెప్పిందే నిజం అయితే రేపే మా అబ్బాయిలకి ఉత్తరాలు రాస్తాను. చెరో నాయిగొందలు టి.ఎం.ఓ. ద్వారా పంపమని.

"మీకేమిటిసార్! మీరొక్కరే కాదు. మరో నలుగుర్ని వెంట తీసుకెళ్ళగలరు."

"దట్సాల్ రైట్! ఎల్లుండి కలు స్తాను." అంటూ బయల్దేరి వెళ్లారు రాయుడుగారు.

ఆ డ్రామా కంపెనీ వారితోకూడా మాట్లాడి సాయంత్రానికి ఇల్లుచేరుకున్నా రాయన.

కొడుకులిద్దరికీ ఉత్తరాలు రాయడం ముగించారు రాయుడుగారు. కవర్లుమూయ బోయేముందర పెద్దకొడుక్కి రాసిన ఉత్తరాన్ని మరోమారు చదవటం ప్రారం భించారు.

చిరంజీవి చంద్రానికి!

నేనిక్కడ క్షేమంగా వున్నాను. చిన్న వాడూ, నువ్వూ రా సి న వుత్తరాలు చేరాయి. మీ అందరి క్షేమ సమాచారాలు తెలుసుకుని చాలా సంతోషించాను.

పోతే ఓ ముఖ్య విషయ్యం! నేను తీర్థయాత్రలు చేయ సంకల్పించు కున్నాను. అందుకనుకూలంగా త్వరలో ఇక్కణ్నుంచో స్పెషల్ రైలు బయల్దేర బోతోంది. దేశంలో దాదాపు పుణ్యక్షేత్రాల్ని చూసిరావటానికి ఇదో గొప్ప అవకాశంగా భావిస్తున్నాను.

యాత్రలూ అనగానే మీ అమ్మ గుర్తు కొస్తోంది.

ఓ సారి—చిలకలపూడి పాండురంగడి ఉత్సవాలకి వెడదామని చెవుల్లో ఇల్లుకట్టు కునీ పోరింది మీ అమ్మ ఆ రోజుల్లో. అందుకు అతికష్టంమీద ఒప్పుకున్నాను.

పాండురంగడి ఉత్సవాలు—ఒక్కడ కొచ్చే వేలాదిజనం- కార్తీక పౌర్ణానికి స్నానాలు చేసే జనసందోహం—ఆ జనం సంగతి మీకు వివరంగా రాయనవసరం లేదు.



రేపు తిరిగి బయల్దేరతామనగా మీ అమ్మ "ఏమండీ! ఇక్కడున్నుంచో బస్సు తీర్థయాత్రలకి బయల్దేరుతోందిట—పిల్లలు కూడా దగ్గరలేరుగా మనంకూడా వెళ్ళొద్దా మండీ!" ఎంతో ఆశగా అడిగింది.

అప్పుడు దాని మాటలకి నాకు చాలా కోపమొచ్చింది. "నీ కిప్పుడు యాత్రలు కావలసి వచ్చాయా? పిల్లలు దగ్గరలేకపోతే బాధ్యతలు దూరమవుతాయా? వాళ్ళ భవిష్యత్తు మన చేతుల్లోవుంది. ఈ సంగతి మర్చిపోయి మన కోర్కెల కళ్ళెం విప్పితే —మన పిల్లలు నిష్ప్రయోజకులౌతారు. ఇప్పట్లో మనకి యాత్రల్లేవు, సుఖాల్లేవు. మన లక్ష్యాల్ని పెడమార్గం పట్టించే మరే ముచ్చట్లూ మనకొద్దు." అన్నాను చాలా కఠినంగా.

పాపం అది ఏమనుకుందో, జాలిగా, దీనంగా, విచారంగా, భయంగా నావేపు చూసింది నాకు జాలేసింది.

"మనిద్దరం సంతోషంగా, హాయిగా యాత్రలుచేసే రోజులు దగ్గరపడ్డయ్. మరేం దిగులు పడకు." అని సముదాయించి ఇంటికి తీసుకొచ్చాను.

ఆనాటి మా బంగారు కల ఇప్పటికి నిజమైంది. కానీ చంద్రం దురదృష్టవంతురాలు సరిగ్గా ఇప్పుడేలేకుండా పోయింది.

మీరంతా మీ అమ్మ చచ్చిపోయిందనుకుంటున్నారు కాదోయ్—మీ అమ్మ చచ్చిపోలేదురా! దానికి చావులేదు. నాలో-నా మనసులో నిత్యం బతుకుతూనే వుంది. ఇది మీ కర్థంకాదు.

ఇన్నాళ్లూ నా కష్టాల్ని మీ అమ్మకి పంచి యిచ్చిన వాడిన్నేను.

ఇవాళ ఇంత భాగ్యాన్నీ నేనొక్కణ్ణీ దోచుకునే దొంగనై పోయాను.

ఈ భావం దూరం కావాలంటే నా మనసునిండా బతుకుతున్న మీ అమ్మతో నే నీ యాత్రలు చేసితీరాలి.

ఈ ఉత్తరం చూసిన వెంటనే నాలు గొందలు తక్కువకాకుండా పైకం పంపించు. చిన్నవాడికి ఈ విషయమై ఇలాగే ఉత్తరం రాస్తున్నాను...

ఆశీస్సులతో
మీ
నాన్న."

చదవడం పూర్తిచేసిన రాయుడుగారు భార్య జ్ఞాపకాల్తో నీటితోనిండిన కళ్ళని తుడుచుకుంటూ కొద్దినిమిషాలు మౌనంగా వుండిపోయారు.

తరువాత రెండు కవర్లూ అంటించి ఒకటి పెద్దకొడుకుపేర హైదరాబాద్‌కీ— రెండోది చిన్నకొడుకుపేర విశాఖపట్నానికీ పోస్టు చేశారాయన!

మూడురోజులు గడిచిపోయాయి. కొడుకుల దగ్గర్నుంచి మనియార్డర్లు రాలేదు. ఆశ్చర్యపోయారు రాయుడు గారు.

మరో రెండు రోజులు గడిచి పోయాయి. యాత్రాస్పెషల్ ఏజంటు రంగారావు కనిపించాడు. టిక్కెట్లు అయి పోతున్నాయి. త్వరపడమని జ్ఞాపకంచేసి వెళ్ళాడు.

రాయుడుగార్లో రకరకాల ఆలోచనలు పోయాయి.

ముష్టి నాలుగొందలు పంపడం వాళ్ళకో లెక్కా! అయితే మరెందు కాలస్యం చేశారు! సమయానికి చేతిలో డబ్బు లేదా! నాన్సెన్స్ లేకపోతే టెంపరరీ అడ్జస్టుమెంట్‌గా ఎవడిదగ్గరన్నా తీసుకుని పంపవచ్చుగా? వాళ్ళు చదువుకునేరోజుల్లో తానలా పంపలేదా? వాళ్ళు వంద పంపమని రాస్తే రెండొందలు చొప్పున పంపేవాడు. తన దగ్గర లేకపోతే తన పరపతి నుప యోగించి చేబదులు పుచ్చుకుని టి.ఎం.ఓ. చేసేవాడు.

తన పిచ్చి ఊహలుగానీ — వాళ్ళే క్యాంపుల్లో వున్నారో? అసలు ఉత్తరాలు చూసుకున్నారో లేవో? అనవసరంగా లేని పోనివన్నీ ఊహించుకుని బాధపడుతున్నా నేమో? అయినా వాళ్ళకేం? మామూలు గుమాస్తాలా? వాళ్లు ఆఫీసర్లు! వాళ్ళకి సవాలక్షపనులుంటయ్. బోడి నాలు గొందలు వాళ్ళకో సమస్యా?

అన్నివిధాలా తనే వెళ్ళడం బాగుం టుంది. వాళ్లనిచూసినట్లు, పని జరిగినట్లూ వుంటుంది.

* *

ఆఫీసు ముందర కొద్దిగజాల దూరంలో రోడ్డుమీద రిక్షాదిగి ముందుకి నడుచు కుంటూ వొస్తున్న రాయుడుగార్ని చూశాడు జవాన్ గంగులు.

చేతిలో కాల్తున్న బీడీని అవతల పారేసి గబగబా ఆయన కెదురెళ్ళి— "దణ్ణాలు బాబుగారూ! కులాసాగా వుండారా? మళ్లీ శానాళ్టికొచ్చారు."

అన్నాడు ఎంతో వినయంగా.

నీ పేరు గంగులు కదూ! బాగున్నావా! నీ భార్యపిల్లలంతా కులాసగా వున్నారా?'' ప్రేమగా అడిగారాయన.

''తమ దయవల్ల అంతా కులాసాయే బాబూ!''

''వెరీగుడ్ . వెరీగుడ్ .. అబ్బాయున్నాడా ఆఫీసులో'',

''ఆఁ ఆఁ వుండారు బాబూ! దయచేయండి లోపలకి'', అంటూ దారి తప్పుకున్నాడు గంగులు.

బూట్లచప్పుడు విన్న మానేజరు తలెత్తి చూశారు. చెయ్యెత్తు విగ్రహంతో రీవీగా వస్తున్న రాయుడుగారగుపించారు.

'నమస్కారమండీ! కులాసా? ఇదేనా రావడం?' .అంటూ కుర్చీలోంచి లేచారు మానేజరు.

రాయుడుగారు ప్రతినమస్కారంచేసి మానేజరు సీటు దగ్గరగా వెళ్ళి—''ఇదే రావడం మీరంతా కులాసానేగద! అన్నట్లు మర్చిపోయాను. మీ అబ్బాయికి మెడిసన్ సీటొచ్చిందా?''

''ఎప్పుడో వచ్చిందండీ! ఇప్పుడు వైజాగ్‌లో చదువుతున్నాడు''

''గుడ్! చాలా సంతోషం. మొత్తం మీద పిల్లవాణ్ని ప్రయోజకుణ్ని చేశారు. మిమ్మల్ని మనసారా అభినందిస్తున్నాను''

''అబ్బాయి అంటూవుంటారు మీ గురించి. నిజంగా మీ తపస్సుముందు నేనెంతటివాణ్నిలెండి.''

''మనదేముందండీ! అంతా ఆ పైవాడి దయ. వాడికి తెలుసండీ! ఎవర్ని ఎలా కాపాడాలో! అబ్బాయున్నాడా లోపల?''

'ఆఁ ఆఁ వెళ్ళండి వున్నారు.''

బయల్దేరారు రాయుడుగారు.

''అరెరె: ఎప్పుడొచ్చావ్ నాన్నా!'' సీట్లోంచిలేచి ఆనందాశ్చర్యాలతో అన్నాడు చంద్రం.

'' ఎప్పుడొచ్చావేమిట్రా వెధవ డైలాగూ! ఇప్పుడు నీ ఎదురుగా వున్నది సాక్షాత్తూ మీ నాన్నే!'' అంటూ పక్కనే ఖాళీ కుర్చీలో కూర్చున్నారు రాయుడు గారు.

చంద్రం ఫైల్సేవో చూస్తున్నాడు.

''చంద్రం! నీ జీప్ ఏదిరా?''

చంద్రం బయటికిచూస్తూ..'అట్నుంచి రెండోది నాన్నా అని మళ్ళీ తన దృష్టిని ఫైల్సు మీదికి మళ్ళించాడు.

''ఏమిట్రా చంద్రం! అవి రేపు చూసుకోవచ్చు పోదాం లే!''

''ఓ పావుగంటలో వెళ్ళిపోదాం. ఇవి చాలా అర్జంటు ఫైల్స్ నాన్నా! '

''నో—పది నిమిషాల్లో పూర్తవ్వాలి. నేను మీ ఆఫీసుచుట్టూ అలా అలా తిరిగి వస్తాను'' అంటూ రాయుడుగారు లేచి బయటికి వెళ్ళారు.

చంద్రంఫైల్స్ చూడటంలో నిమగ్నుడయ్యాడు.

కొద్ది నిమిషాల అనంతరం రాయుడు గారు లోపలకి అడుగుపెడుతూనే—

"చంద్రం యిహలే వెడదాం" అన్నారు.

చంద్రం కాలింగ్‌బెల్లు నొక్కాడు. మరుక్షణం చేతులు కట్టుకుని వచ్చి నిల బడ్డాడు ఏమిటన్నట్లు.

"డ్రైవర్‌ని పిలువు!"

"చిత్తం." వెళ్ళిపోయాడు.

తండ్రి కొడుకులిద్దరూ గుమ్మం దాట గానే మానేజర్‌గబగబా బయటికొచ్చి—

"ఇంటికెడుతున్నారా! నాల్రోజులుంటా రుగా?"అన్నాడు రాయుడుగార్నివుద్దేశించి.

"ఆఁ....ఆఁ....నాల్రోజు లుంటాను. మళ్ళీ కలుద్దాంలెండి" అంటూ కొడుకుతో బాటు జీప్‌లో కూర్చున్నారు రాయుడు గారు.

కొద్ది నిమిషాల్లో జీపు సరాసరి ఓ యింటిముందాగింది,

"చంద్రం!ఇక్కడెవర్తోనన్నా మాట్లా డాలా? త్వరగా వచ్చెయ్" అన్నారు రాయుడుగారు.

"ఇదేనాన్నా మన యిల్లు. పూర్వంది మార్చి దాదాపు ఆర్నెల్లు కావస్తోంది".... నవ్వుతూ అన్నాడు చంద్రం.

తండ్రీ కొడుకులు దిగ్గానే డ్రైవర్ కూడా దిగి చంద్రానికి మిలిటరీ పద్ధతిలో సాల్యూట్‌చేసి జీపు వెనక్కి మళ్ళించుకు పోయాడు.

రాయుడుగారు బయటనుంచుని కొద్ది క్షణాలు ఆ డాబాని పరిశీలనగా చూసి "ప్చ్....అప్పీరెన్సేమీ బాగుండలేదురా చంద్రం!" అన్నారు.

చంద్రం మాట్లాడలేదు.

వంట గదిలోంచి అప్పుడే హాల్లో కడుగుపెడుతున్న మంజుల హఠాత్తుగా రాయుడుగార్ని చూసి దైవాన్ని చూసి నంత సంబరంతో—"ఎప్పుడు మామ గారూ రావడం?' ఎదురొచ్చింది.

"ఇంతకుముందేనమ్మా! ఏరీ పిల్లలు కనిపించరేం?" చుట్టుపక్కల కలయ చూస్తూ అన్నారాయన.

"స్కూల్‌కి వెళ్లారు. వచ్చేవేళైంది. మీరు స్నానానికి లేవండి." అందామె.

ఆయనది వినిపించుకోకుండా గబగబా నాలుగ్గదూలూ తిరిగి హాల్లోకొచ్చి వాలు కుర్చీలో చేరగిల బడ్డారు.

చంద్రం దంపతులు ఎదురుగ్గా నిల్చునే వున్నారు—

"ఇంతకుముందున్న యిల్లు మహా దర్జాగా ఇంద్ర భవనంలా వుండేది. నిజంగా నీలాంటి ఆఫీసర్లకది ఎంతో తగింది. ఇది నాకేమాత్రం నచ్చలేదు. ఎందుకని మార్చారు చంద్రం?"

'అది చాలా పెద్ద యిల్లు! పైగా అంత అద్దె కూడా మాకు భారమని పించింది."

'భారం మనసులో అనుకున్న రాయుడుగారి గుండెల్ని ఎవరో బలంగా పిండినట్లయింది.

'చంద్రం! అఫీసుకి కోటు వేసు కెళ్ళవా? ఎదీ ఓసారి నీ సూట్లన్నీ పట్రా



'ఏం బ్రదర్, తలకాయమీద ఆ బొప్పి ఏమిటి? బుగ్గ మీద ఆ ప్లాస్టర్ యేమిటి?
ఏదో చిన్న ప్రేమ వ్యవహారంలే.
నీ ప్రియురాలి హస్తవాసి కాదుగద?
కాదులే. ఆమె ప్రియుడి చేతి చలవ.

చూడాలనుంది.''

"కోట్లుసూట్లు అనవసరం నాన్నా! మనిషి విలువల్ని అంచనావేసేది బట్టల్ని బట్టి కాదుగా!'

ఆ మాటల్లో ఏదో భావం లీలగా తోచి రాయుడుగారు బరువుగా నిట్టూర్చారు.

ఇంతలో స్కూల్‌నుంచి ముగ్గురు మనుమళ్ళు వచ్చి రాయుడుగార్ని చూసి 'తాతయ్యా .. తాతయ్యా!'' అంటూ రాయుడుగార్ని చుట్టుకుపోయారు.

వాళ్ళని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని—''ఛీ ఛీ ఏంబట్టలా ఇవి? ఆఫీసరుగారి పిల్లలు ఇలాగేనా వుండేది?''

చంద్రం దంపతులు మాట్లాడలేదు.

''మరే తాతయ్యా! మా యింటిపక్కన తాలూకాఫీసు గుమాస్తా వున్నాడు. అతని కొడుకు రంగడు మాక్లాసే! వాడెంత చక్కని బట్టలేసుకొస్తా డనుకున్నావ్! వాడి బూట్లు ఎంతబావుంటయ్! ఎంత దర్జాగాఉంటాడనుకున్నావ్ తాతయ్యా!''

నోర్మూయ్ వెధవా? వాడి బూట్లకంటే నీ చెప్పులే ఖరీదైనవి. తాతయ్యా! అబద్దాలు చెప్పకు?'' మందలిస్తున్నట్లు కళ్లుపెద్దవిచేసి కోపంగా చూసింది మంజుల.

బిక్కమొహం పెట్టాడు బాబు.

ఎవరు అబద్ధాలు చెబుతున్నదీ గ్రహించిన రాయుడుగారు మరోసారి బాధగా నిట్టూర్చారు.

ఊహల్లోంచి వాస్తవ్యంలోకి దిగిన

రాయుడుగారు—తాను ఆశల శిఖరాల్నుంచి మజిలీలుగా కిందికి దొర్లిపోతున్నట్లు—తను మనసాకాశంలో నిర్మించుకున్న రమ్యహర్మ్యాలు తన కళ్ళముందే పేక మేడల్లా దారుణంగా కూలిపోతున్నట్లు అనుభూతి చెందారు.

కొడుకుల స్థితిగతుల్ని ఉన్నతంగా వూహించుకుని తెలియని ఆనందంలో—నిశ్చింతగా — నిర్విచారంగా — గర్వంగా బతుకుతున్న రాయుడు ఒక్కసారి నిలువునా కృంగిపోయి దైన్యమూర్తిగా మారి మూరపుకొండల్ని అతిదగ్గరగా చూస్తున్నట్లయ్యింది.

రాయుడుగారి మనసు ఆర్ద్రమైంది.

చంద్రం బట్టలు మార్చుకునే మిష తోనూ—మంజుల వంటగదిలో పనున్నట్లు అక్కణ్నుంచి తప్పుకున్నారు.

రాత్రి పదిగంటలు దాటివుంటుంది. రాయుడుగారిక్కి నిద్రపట్టడంలేదు। ఎడతెరిపి లేని ఆలోచనలు ఆయన మనసుని కకావికలం చేస్తున్నాయి. హఠాత్తుగా రాయుడుగారి కళ్ళనుంచి వెచ్చటి నీటి బిందువులు జాలువారుతున్నాయి.

ఆకాశంలో మేఘగర్జనలు—తళుక్కున మెరుపులు—కుండపోతగా వర్షం ప్రారంభమైంది.

కిటికీలోంచి ఝుంయ్‌మంటూ వస్తున్న చల్లటి ఈదురుగాల్ని భరించలేకపోయారు రాయుడుగారు. గభాల్న మంచంమీద నుంచి లేచి చలిగాలికి దుప్పటినిండుగా కప్పుకుని గబగబ వెళ్ళి కిటికీ తలుపులు మూసివేశారు.

"చలి విపరీతంగా వుంది. పిల్లలకు దుప్పటి కప్పారో లేదో?" అనుకున్నారాయన.

ఇవతల గదిలో—

మంజుల చంద్రం దగ్గరగా జరిగి కూర్చుని "ఏమిటండీ। ప్రతి చిన్న విషయానికీ మీ నాన్న అలా ఇదై పోతారేం?"

"నీకు ఆయన సంగతి బాగా తెలియదు మంజూ। నిజంగా ఆయన మమ్మల్ని మహారాజుల్లా గొప్పగా పెంచారు. నా కొడుకులు ఆఫీసర్లని కలలు కంటూ అలా పెరిగిపోతున్నారే గాని వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చినరోజునే లోన్‌కి అప్లై చేశాను. బహుశా నాలుగైదు రోజుల్లో మంజూరై రావచ్చు. అసలీ విషయాన్ని నాన్నకెలా చెప్పాలో తెలియడం లేదు. ఓ రకంగా మేమూ పొరపాటు చేస్తున్నామేమో?" ఒక్కక్షణం ఆగాడు చంద్రం.

"మీరు పొరపాటు చేస్తున్నారా? ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది మంజుల.

"మేంకూడా నేడు చాలామంది చేస్తున్నట్లు బల్లకింద చేతులు చాపినట్లయితే ఈ పాటికి వేలు గడించేవాళ్లం. మా నాన్నని నెలకో యాత్ర మహాదర్జాగా చేయించేవాళ్ళం. కానీ నేటి మన పరిస్థితి. •

పరే, ఇహ నిద్ర వస్తోంది పడుకో మంజూ!" అంటూ మంచంమీద వాలిపోయాడు చంద్రం.

మంజులకూడా నిద్ర కుపక్రమించింది.

ఉదయాన్నే—

"ఏమండీ! ఏమండీ! మీ నాన్న వూరు బయల్దేరారు. త్వరగా లేవండి." హడావుడి పెడుతూ అంది మంజుల

చంద్రం కంగారుగా లేచాడు నాల్రోజులుంటాడనుకున్న తండ్రి అప్పుడే ప్రయాణం కట్టడం అతనికి చాలా ఆశ్చర్యాన్ని ఆందోళనని కలిగించింది.

గబగబ గదిలోకెళ్ళి ప్రయాణ సన్నాహాల్లో వున్న తండ్రిని చూసి "నాన్నా! లోన్‌కి అప్లై చేసాను. నాల్రోజుల్లో మంజూరై చేతికొస్తుంది. నిక్షేపంగా యాత్రలు చేద్దువుగాని. తమ్ముడుకూడా నా లాగానే అనుకుంటున్నట్లు తెలియజేశాడు నాల్రోజులుండు నాన్నా!" ప్రాధేయపడుతున్నట్లడిగాడు చంద్రం.

"నా యాత్రగురించి బాధపడకు చంద్రం! మరేం ఫరవాలేదు నేను ఇంటికి వెళ్ళాలి. చాలా అర్జంటు పన్లున్నయి.' చాలా తేలిగ్గా సమాధానం చెప్పారు రాయుడుగారు,

చంద్రం ఎదురు చెప్పలేకపోయాడు.

తండ్రిని స్టేషన్‌దాకా సాగనంపి రైలెక్కించి వచ్చాడు చంద్రం.

ఆఫీసులో కూర్చుని టపాచూస్తున్న చంద్రానికి తండ్రి దస్తూరితో కవరగుపించింది. అప్పుడే నాన్న ఇల్లుచేరడం - ఉత్తరం రాయడం కూడా అయ్యిందే అనుకుంటూ గభాల్న ఆ కవర్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

చిరంజీవి చంద్రానికి!

నేను మీ దగ్గరకు రావడం ఎంతో మేలైంది. నిజాయితీని నమ్ముకుని బతికే మనుషుల ముఖమండలంలో భాసించే నిర్మలత్వం—సంతోషం— సంతృప్తి —అపమార్గాన లక్షలార్జించినా అలా వుండలేరు. వున్నట్లు నటించినా ఆ మనుషుల బతుకులు మేడిపండులాంటివే!

నాయాత్ర మీ స్థితిగతుల్ని తెలుసుకునేందుకు ఉపయోగించి నీపట్ల గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఆనందాన్ని ప్రసాదించింది. మీలాంటి ఆఫీసర్లకి తండ్రిని కాగలిగినందుకు ఎంతో గర్వపడుతున్నాను. ఇప్పుడు నా ఆనందానికి పట్టపగాల్లేకుండా వున్నయి. నాలాంటి అదృష్టవంతులైన తండ్రులు ప్రపంచంలో చాలా అరుదుగా వుంటారు చంద్రం! ఇంతకంటే! నాకింకేం కావాలి?

నేను యాత్ర చేయలేదని మీరేమీ బెంగపడవద్దు. నాకా బాధగానీ—అసంతృప్తిగానీ ఏకోశానా లేదు. మేడిపండు లాంటి బతుకులు మనకొద్దు. మనకీ జీవితం చాలు.

ఆశీస్సులతో

మీ నాన్న.